
# అవతారంగారి శిష్యుడు



మధ్యాహ్నపు వేళ....

మధ్య గదిలో వాలు కుర్చీలో వెనక్కి వాలి పత్రికలో పూర్తిగా లీనమయిన విజయ, ఎవరో పిలిచినట్టయి ఉలికిపాటుతో తలెత్తింది. సరాసరి గేటు తీసుకుని లోపలికి వచ్చి వరండాలో నిలబడ్డ ఆ అరవై ఏళ్ళ వృద్ధుణ్ణి ఆశ్చర్యంగా చూసి చటుక్కున కుర్చీలోంచి లేచింది...

"రాజారావు ఉన్నాడామ్మా ?"

"ఉన్నారు తాతగారూ ! పడుకున్నారు... అలా కుర్చీలో కూర్చోండి ! ఆయన్ని లేపుతాను !" అంటూ లోపలికి వెళ్ళింది విజయ.

"ఫరవాలేదులేమ్మా ! వాడ్ని పడుకోనీ... లేచిన తరువాత మాట్లాడతాలే !"

ఇంత చనువుగా, ఆత్మీయంగా మాట్లాడుతూన్న ఈయన ఎవరు...? ఇంతకు ముందెప్పుడూ చూసిన గుర్తులేదే... అనుకుంటూ ఆలోచనలో పడింది విజయ...!

ఫ్రిజ్ నుండి గాజు సీసాలోని చల్లటి నీళ్ళు, గ్లాసులోకి ఒంపి గబగబా తీసుకెళ్ళి ఆయన చేతికిచ్చింది...!

నెరిసిన జుట్టు... నుదుట కుంకుమ బొట్టు... కళ్ళకు దళసరి అద్దాల కళ్ళజోడు... పొడుగు చేతుల చొక్కా... ముతక పంచె... భుజం మీద కండువా... ముడతలు పడ్డ ముఖంలో స్పష్టంగా కనపడుతూన్న ఏదో స్వచ్ఛత... పవిత్రత... చూడగానే నమస్కరించాలనే భావం కలిగేలా గాంభీర్యమైన రూపం...! ఎవరీయన...?

"నే నెవరాని ఆలోచిస్తున్నావామ్మా ? నా

పేరు అవతారం...! మీ ఆయనకు ఆరేళ్ళు పాఠాలు చెప్పిన వాడిని... ఇప్పుడర్థమయిందా...?

గ్లాసులోని నీళ్ళు గడగడ త్రాగి గ్లాసు క్రింద పెట్టాడాయన...!

విజయ వరండాలోని ఫేను స్విచ్చి నొక్కి పరుగు పెట్టినట్టుగా లోపలికి వెళ్ళింది.

"ఏవండీ ! మీకోసం ఎవరో వచ్చారు... అవతారం మాస్టారుట లేవండీ !" పడవలాంటి మంచంలో ఆదమరచి నిద్రపోతున్న భర్తను తట్టి లేపింది... అప్పుడే పడుకున్నాడేమో, రాజారావు బద్ధకాన్ని ప్రదర్శిస్తూ అయిదు నిముషాలకి లేచాడు. చికాగ్గా లుంగీ సర్దుకుని, చొక్కా వేసుకుని వరండాలోకి వచ్చాడు.

"ఏమిరోయ్ ! రాజారావు బహద్దూరు గారూ! బాగున్నావా...? బాగా ఒళ్ళు చేశావు సుమా ! అప్పటికీ ఇప్పటికీ అసలు పోలికలే లేవు...!" మాస్టారు కళ్ళ జోడులోంచి పైకి క్రిందకూ రాజారావును చూస్తూ అన్నారు...!

"ఎప్పుడో పదిహేనేళ్ళకు పైనే... రవీంద్రపురం హైస్కూల్లో చదివేటప్పుడు లేత బీరకాయలా పీలగా ఉండేవాడివి... అలా చూస్తున్నావేమిట్రా...? నేనసలు గుర్తున్నానా లేదా...? నేను గుర్తు లేకపోయినా, నా మొట్టికాయలు గుర్తుండాలే...! ఎందుకంటే, నా మొట్టికాయలతో మాడు పగల కొట్టించుకున్నది, ఎక్కువగా నువ్వేగా..." గంట వాయించినట్టు గణగణా మాట్లాడుతూ భళ్ళుమని నవ్వారు అవతారం మాస్టారు...!

"నమస్కారం మాస్టారూ! నన్ను క్షమించండి! వెంటనే గుర్తుపట్టలేకపోయాను. మిమ్మల్ని చూసి చాలా కాలమయింది కదా !" రాజారావు రెండు చేతులూ జోడించి తన వినయ విధేయతల్ని ప్రదర్శించాడు.

వీధిలోంచి వెళుతూ ఉంటే, బయట బోర్డు మీద నీ పేరు చూశాన్రా ! అంతే ! మరి ఆలోచించలేదు... లోపలికి వచ్చేశాను..."

"మంచి పనిచేశారు మాస్టారూ ! మిమ్మల్నిలా చూడటం నాకు చాలా ఆనందంగా ఉంది... నన్నూ నా పేరునీ ఇంతగా గుర్తుపెట్టుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను !" రాజారావు మరింత వినమ్రుడయ్యాడు.

"నిన్నెలామరిచిపోతాన్రా ! ఆ రోజుల్లో నువ్వెంత అల్లరి చేసేవాడివి...? ఆడపిల్లల్ని ఏడిపించే వాడివి... బీడీలు కాల్చేవాడివి... ఇద్దరో ముగ్గురో బడుద్ధాయిల్ని వెంటబెట్టుకుని తిరిగే వాడివి... క్లాసులకి ఎగనామం పెట్టి మేట్నీ సినిమా లకు చెక్కేసే వాడివి...! ఒకసారి స్కూలు గ్రౌండులో ఉసిరి చెట్టు ఎక్కి దబ్బుమని కిందపడ్డావు... కాలు మడత పడిపోయింది. పిల్లలంతా నిన్ను ఆసుపత్రికి మోసుకుపోతే, నేనూ సాయం వచ్చి వైద్యం దగ్గరుండి చేయించాను... మరిచిపోయావా...?"

"లేదు మాస్టారూ ! ఎలా మరిచిపోతాను...? అప్పుడంతా చిన్నతనం..."

రాజారావు సిగ్గుపడినట్టుగా నవ్వాడు... విజయ వీళ్ళిద్దర్నీ విస్మయంగా చూస్తోంది...!

"మరోసారి !! రాణీగ్రేస్ పంతులమ్మ, నువ్వు ఆడపిల్లల వెంటబడి పోకిరీ వేషాలేస్తున్నావని హెడ్‌మాస్టారుకి ఫిర్యాదు చేసింది... ఆ హెడ్ మాస్టారు రాఘవరావు అసలే చండశాసనుడు... కుర్రాళ్ళల్లో తేడా ఏది కనిపించినా తోలు ఒల్చేసేవాడు... నువ్వు ఏడుపు మొహం పెట్టాశావ్! అప్పుడు నేను నిన్ను వెనకేసుకొచ్చి ఆ పంతులమ్మని ఒక దులుపు దులిపేశాను-పాఠాలు చెప్పే మాస్టర్లు కూడా పిల్లలకు ఆదర్శంగా ఉండాలనీ ! ఎందుకంటే... ఆ రాణీ గ్రేస్‌మేడమ్ డ్రాయింగు మాస్టారుతో సాగించే వ్యవహారం నాకు పూర్తిగా తెలుసు కాబట్టీ...! ఏవంటావ్...?" మాస్టారు మళ్ళీ భళ్ళుమని నవ్వారు...!

"అవును మాస్టారూ ! అప్పట్లో మీరు నామీద చూపించిన అభిమానం నేను మరచిపోలేను..." రాజారావు మాటల్లో, చూపుల్లో కృతజ్ఞత వెల్లివిరిసింది. "అల్లరిచేసినా అన్నిట్లోనూ ఫస్టు వచ్చేవాడివి. అందుకే నిన్నెవ్వరూ పల్లెత్తు మాట

అనేవారు కాదు... ఆ రవీంద్రపురం హైస్కూలు రోజులు మళ్ళీ ఎలా వస్తాయిరా...? స్కూలు ముందు గానుగ చెట్టు ఎంత చల్లటి నీడనిచ్చేది...? ఆ గానుగ చెట్టు నీడలో మధ్యాహ్నం పూట మషాలా గారెలమ్మే ముసలమ్మ నాకింకా గుర్తు... స్కూలు ప్రక్క, సత్తార్ సాహేబ్, హోటల్లోంచి అప్పుడప్పుడూ నాకు పూరీలు తెచ్చిపెట్టేవాడివి నువ్వు... వాడు బంగాళా దుంపకూర, బహుపసందుగా చేసేవాడు కదూ ! ఆ కూరతో ఎన్ని పూరీలయినా తినాలనిపించేది... సాయంత్రంపూట, నేను ఒక్కడ్నే ఉప్పాడ సముద్రం వైపు నడిచి వెళ్ళిపోతూంటే నలుగురు కుర్రాళ్ళని వెంటబెట్టుకుని.నువ్వూ నాతో వచ్చేవాడివి... సముద్రపు ఒడ్డున కూర్చుంటే సమయం తెలిసేది కాదు... ఆ ఆనందం... అనుభూతి... మాటల్లో చెప్పగలమా...? ఏంవిటోరా? నా సొద నేను చెప్పుకుతున్నాను... నీ పేరేంటమ్మా...? ఎంతమంది పిల్లలు...? మావాడికి సరియైన జోడు కుదిరావు...!'' కళ్ళజోడు లోంచి విజయను చూస్తూ వాత్సల్యంగా అడిగారు అవతారం మాస్టారు...!

"నా పేరు విజయదుర్గండీ ! పిల్లలు బాబూ, పాప...! శెలవులు కదాండీ... వాళ్ళ తాతగారింటికి వెళ్ళారు...'' విజయ చిన్నగా నవ్వుతూ జవాబు చెప్పింది.

"చాలా సంతోషం తల్లీ ! చిన్న కుటుంబం... చింతలు లేని కుటుంబం కదా ! మా రోజుల్లో ఈ పద్ధతులంటే అంత పట్టింపులుండేవి కావు...!'' మాస్టారు జేబులోంచి శ్యం డిబ్బీ తీసుకుని చిటకెడు నశ్యాన్ని నాసి కాపుటాల్లోకి దట్టించారు...

"విజయా ! మాస్టారు ఎప్పుడు తిన్నారో ఏంవిటో... భోజనం ఏర్పాటు చూడు...! రాజారావు భార్యని ఆదేశించాడు...

"ఆ భోజనానిదేముంది లేరా ! బయట చేస్తాలే... అమ్మాయిని ఇబ్బంది పెట్టకు...! నీతో కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోతాను...!'' మాస్టారు మొహమాటపడ్డారు...!

"నాకేం ఇబ్బంది లేదండీ ! కూరలున్నాయి... అయిదు నిముషాల్లో కుక్కర్‌లో అన్నం వండేస్తాను.' విజయ హడావుడిగా లోపలికి వెళ్ళింది...!

"ఈ పూట మా ఇంట్లో భోజనం చేయకుండా వెళ్ళడానికి వీల్లేదు మాస్టారూ ! చెప్పండి... ఇంకేవిటి కబుర్లు...?'' రాజారావు పట్టుదలగా అన్నాడు...

"కబుర్లకేమున్నాయిరా ! నా దురదృష్టం... నాకు నలుగురూ ఆడపిల్లలే ! నీకు తెలియదు కదూ ! ముగ్గురాడపిల్లలకీ చచ్చీ చెడీ ఎలాగో పెళ్ళిళ్ళు చేశాను... రిటైరయ్యేనాటికి చేతిలో చిల్లి గవ్వ మిగలలేదు... నాలుగో పిల్ల పెళ్ళి నాకో సమస్యగా మిగిలిపోయిందిరా... దాని నెత్తిమీద కూడా రెండు అక్షింతలు వేస్తే నాకు నిశ్చింత...!'' మాస్టారి స్వరంలో బాధ, బెంగ తొంగి చూశాయి !

'మీరేం బెంగ పెట్టుకోకండి మాస్టారూ ! ఆ అమ్మాయి పెళ్ళికూడా సవ్యంగా జరుగుతుంది !' రాజారావు భరోసాగా అన్నాడు...!

"అందుకేరా ! నా శిష్యులు ఎక్కడెక్కడ ఉన్నారో వెదికి, నా సమస్య చెప్పుకోవాలనే ఇలా ఊళ్ళ మీద పడ్డాను...!'' మాస్టారుకి కొంచెం ఊరట కలిగింది.

"ఏవండీ ! వంటయిపోయింది... వడ్డిం చేస్తున్నాను...!'' విజయ లోపలినుంచి కేక పెట్టింది.

రాజారావు చిన్న బకెట్‌లో నీళ్ళు తెచ్చి చెంబుతో మాస్టారి కాళ్ళ మీద పోశాడు... ఆయన వారిస్తున్నా తువ్వాలుతో కాళ్ళు తుడిచాడు... మాస్టారి కళ్ళు సజల నేత్రాలయినాయి...! విశాలమైన డైనింగు హాల్లో విజయ, టేబులు మీద రెండు రకాల కూరలు, ఆవకాయ, సాంబారు, పెరుగుతో భోజనం వడ్డించింది. భార్యాభర్త లిద్దరూ కొసరి కొసరి వడ్డిస్తూంటే మాస్టారు తృప్తిగా భోజనం చేసి బ్రేవుమంటు త్రేన్చారు...

"చాలా కాలానికి మంచి భోజనం పెట్టావమ్మా! అన్నదాతా సుఖీభవ...! ఆయుష్మాన్‌భవ...!'' విజయకు ఆశీర్వచనం అందించారు. హాల్లోకి వచ్చి వెడల్పాటి సోఫాలో వెనక్కివాలారు... కలర్ టీవీ, ఫ్రిజ్, ఖరీదైన తివాచీలు, గోడలకు తైలవర్ణ చిత్రాలు,

మెత్తటి సోఫాలు చూసి ఆయన మనసు ఉబ్బితబ్బిబ్బయింది..

'ఏమిరోయ్ ! బాగానే సంపాదిస్తున్నాట్టున్నావు... బయట బోర్డు మీద, ఏంవిటీ రాసి ఉందీ... మునిసిపల్ ఆఫీసులోనా నీ ఉద్యోగం...?' మాస్టారు నవ్వుతూ అడిగారు.

"నాది ఉద్యోగం కాదు మాస్టారూ! మునిసిపల్ ఆఫీసుకు సంబంధించి కాంట్రాక్టు పనులు చేయిస్తుంటాను... ఏదో మీ దయవల్ల ఫరవా లేదు..." రాజారావు నమ్రతగా అన్నాడు.

"కాంట్రాక్టు పనులు చేయిస్తున్నావా...? అదేంవిట్రా...? నీలాంటి తెలివైన వాడికి ఉద్యోగం రాకపోవడం ఏమిటి...? మంచి ఉద్యోగం రావాలే...! ఎక్కడో తిరకాసుంది... పోనీలే ! ఏదో ఒకటి... జీవనం హాయిగా గడిచిపోతుంది కదా !" విజయ స్టీలు పళ్ళెంలో ఆకులు, వక్కా, సున్నం తెచ్చి మాస్టారి ముందు పెట్టింది. "ఎవరికమ్మా ఇవి...? నాకే...? ఇలా చూడు..." మాస్టారు పళ్ళు లేని తన బోసి నోరు చూపించి మరోసారి భళ్ళుమని నవ్వారు... విజయ రాజారావులిద్దరూ మాస్టారి నవ్వులో పాలు పంచుకున్నారు... అందరిలోనూ ఆనందం తుళ్ళిపడింది...

"ఇక నేను వస్తా(నా మరి... మీ దంపతుల అభిమానం, ఆతిథ్యం నేనీ జన్మలో మరచిపోలేను...' ' మాస్టారు సోఫాలోంచి లేచారు.

"ఒక్క క్షణం ఉండండి మాస్టారూ !" రాజారావు లోపలికి వెళ్ళాడు. రెండు నిముషాల్లో తిరిగి వచ్చి తెల్లటి కవరు మాస్టారి చేతిలో పెట్టాడు.

"ఇందులో అయిదు వందలున్నాయి మాస్టారు... ఉంచండి ! అవసరానికి ఉపయోగ పడవచ్చు... అమ్మాయికి ఏదైనా సంబంధిం చూడండి...

నా శక్తి మేరకు నేనూ ఎంతో కొంత ఆర్థిక సహాయం చేస్తాను...!" రాజారావు స్థిరనిశ్చయంతో అన్నాడు..

"తీసుకోండి మాస్టారూ సందేహించకండీ!. మీరు మా తండ్రిలాంటి వారు !" విజయ బలవంతం పెట్టింది.

"ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి, దారిద్ర్యాన్ని ఎన్ని రకాలుగా అనుభవించాలో అన్ని రకాలుగానూ అనుభవిస్తున్నానురా ! పెన్షన్ డబ్బులతోపూటలు గడవటం దినదిన గండంగా ఉంది...! ఇన్నాళ్ళకు నీలాంటి ఆదుకునే శిష్యుడు దొరకడం... నా పూర్వజన్మ సుకృతమే తప్ప మరొకటి కాదు..." మాస్టారి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. గొంతు గాద్గదికమయింది...

"మాస్టారూ ! మీరేమీ అనుకోనంటే ఒక్క మాట..!" రాజారావు నిశ్చలంగా అన్నాడు.

"ఒక్క మాట కాదురా ! నువ్వు వంద మాటలు చెప్పినా నేనిలాగే నిలబడి వింటాను... చెప్పు!" మాస్టారు నవ్వుతూ నిటారుగా నిలబడ్డారు.

"రాజారావు ఆ మాటేవిటో మాస్టారితో చిన్నగా అన్నాడు..." అపరాధ భావంతో తలవంచుకున్నాడు.

ఒక క్షణం నిశ్శబ్దం... అక్కడ శబ్దమయింది.అవతారం మాస్టారు కళ్ళ జోడు తీసి కళ్ళు చికిలించి రాజారావు వైపు అదోలా చూశారు... అతని దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేసి మళ్ళీ భళ్ళుమని నవ్వారు.

"ఏరా భడవా ! నన్ను ఆటపట్టిస్తున్నావా...? హాస్యాలాడుతున్నావా...?"

"క్షమించండి మాస్టారూ ! నా పేరు రాజారావే కాని... మీ శిష్యుడు రాజారావుని మాత్రం కాదు...' ఈ సారి రాజారావు గొంతులో ధ్వనించిన గంభీరతకు మాస్టారు నివ్వెరపడుతూ నిశ్చేతనంగా ఉండిపోయారు.

"నిజం...మాస్టారూ మిమ్మల్ని ప్రొద్దుట బజారులో చూశాను... ఫుట్‌పాత్ మీద ఎవరో గబగబా వెళ్ళిపోతూంటే..." ఒరేయ్ ! నువ్వు బాల కృష్ణవి కదూ ! రవీంద్రపురం హైస్కూల్లో చదివావు కదూ ! ఎంత ఎదిగి పోయావురా ! అంటూ ఎంతో ఆత్మీయంగా పలకరించారు మీరు. ఆ వ్యక్తి మిమ్మల్ని ఓ పిచ్చివాడిలా చూసి, ఓ ముష్టివాడిలా

కసిరి "ఫో ! పోవోయ్" అంటూ విదిలించి వెళ్ళిపోయాడు... మీ వయస్సుకీ రూపానికీకూడా కనీస విలువ ఇవ్వలేదా వ్యక్తి... చుట్టు ఉన్న జనం మిమ్మల్ని వింతగా చూశారు... ఆ మాత్రం దూరంలో కిళ్ళీ కొట్టు దగ్గర నిలబడి... మిమ్మల్ని చూస్తున్న నాకు బాధ కలిగింది... చిన్న బుచ్చుకున్న మీ ముఖాన్ని చూస్తే మనసు చివుక్కుమంది... నేను గబగబా మీ దగ్గరికి వచ్చేను... అప్పటికే మీరు జనంలో కలిసిపోయి ముందుకు వెళ్ళిపోయారు.!'

రాజారావు ఒక్క క్షణం ఆగి మాస్టారు ముఖంలోకి చూశాడు. మాస్టారు మౌనంగా వెళ్ళి... మళ్ళీ సోఫాలో కూర్చున్నారు... కళ్ళు మూసుకుని తల వెనక్కి వాల్చి ఏదో ఆలోచనా ముద్రలోకి వెళ్ళిపోయారు...

"ప్రొద్దుట బజారులో కనిపించిన మీరు... మధ్యాహ్నం నా ఇంట్లో ప్రత్యక్షమయ్యే సరికి ఆశ్చర్యమూ, ఆనందమూ నన్ను ముంచెత్తాయి... మాస్టారూ ! నేను ఏ హైస్కూల్లోనూ చదవుకోలేదు... అయిదవ తరగతి వరకూ బళ్ళోకి వెళ్ళినా, నాకు చదువు వంటబట్టలేదు... చదువంటే నాకు అసలు కిట్టేది కాదు... బడికి సరిగ్గా వెళ్ళేవాడ్ని కాదు... చదువు విలువ పూర్తిగా అర్థమయ్యే సరికి నేను చాలా దూరం వచ్చేశాను మాస్టారూ ! సంసారం... తాపత్రయం... సంపాదన... పరుగు... నేను కోల్పోయిందేమిటో నాకు తెలిసింది... అవసరానికి మించి డబ్బు సంపాదిస్తున్నా చదువుకో లేదనే బాధ మాత్రం, నా అంతరంగంలో మానని గాయంగానే మిగిలిపోయింది... ఆ రాజారావు ఎవరో అతని స్థానంలో ఈ పూట మిమ్మల్ని గౌరవించి భోజనం పెట్టే అదృష్టం కలిగింది నాకు... అంతేకాదు... నేనూ మీ శిష్యరికంలో... ఆ రవీంద్రపురం హైస్కూల్లో చదువుకున్నట్టే అందమైన అనుభూతి కలిగింది మాస్టారూ ! ఇది నాకు అనంతమైన సంతృప్తి : ఆనందం.!"

మాస్టారు కళ్ళు తెరిచారు... ఆయన కళ్ళల్లో కన్నీటి ముత్యాలు...!

"కనిపించినవాడినల్లా కళ్ళు విప్పార్చుకుని చూసి... వీడు నా శిష్యుడే అనుకోవడం... మా ఉపాధ్యాయ జాతికి ఉన్న బలహీనత బాబూ ! దృష్టి మాంద్యం వల్లనో, జ్ఞాపక శక్తి క్షీణించడం వల్లనో... బయట బోర్డు మీద నీ పేరు చూసి చొరవగా నీ ఇంట్లోకి వచ్చేశాను... నువ్వే నన్ను క్షమించాలి... చదువు వల్లనే సంస్కార గంధం అలవడు తుందనుకోవడం చాలా పొరపాటు. నా దగ్గర చదువుకున్న వాళ్ళు ఎంతోమంది ఇప్పుడు ఉన్నతోద్యోగాల్లో ఉన్నారు... ఉన్నత పదవుల్లో ఉన్నారు... అలాంటి శిష్యుల్ని అయిదారుగుర్ని కలుసుకోవడానికి పనికట్టుకుని వెళ్ళాను... కొందరు ముఖం చాటేశారు. కొంతమంది ముక్తసరిగా మాట్లాడారు... మరి కొంతమంది లోపల ఉన్నా పనివాళ్ళతో లేరని చెప్పించారు... బాబూ ! గురు శిష్య సంబంధాలూ, విలువలు, విద్యా వ్యాపార నాగరికతా వెల్లువలో ఎప్పుడో కొట్టుకుపోయాయి... గురువును చెంప దెబ్బలతో గౌరవించే సంస్కృతి పరిఢవిల్లుతూన్న ఈ రోజుల్లో నేను నీ గురువుని కాకపోయినా, ఆదరించి ఇంత అన్నం పెట్టేవు... అపారమైన భక్తి ప్రపత్తుల్ని ప్రదర్శించేవు... అంతకు మించి సాటి మనిషిని చూసి స్పందించే సంస్కార గంధాన్ని పరిమళింప చేశావు... ఇది నిజంగా నాకు ఏ అనుభూతికి అందని అనుభం నాయనా !

మరొక్క మాట... నీకు అభ్యంతరం లేకపోతే వారం వారం నీ ఇంటికి వచ్చి ఒక్క గంట సేపు నీకు చదువు చెప్పాలని ఉంది... నాకా అవకాశం కలిగించు బాబూ !" మాస్టారు ఆశగా, అభ్యర్థనగా అడిగారు.

"అంతకంటేనా మాస్టారూ ! అవతారం గారి శిష్యుడు అనిపించుకోవడం కంటే నాకు అదృష్టం ఏముంది ?"

రాజారావు మాటలకి మాస్టారు ఆశీః పూర్వ కంగా చేతులెత్తారు... అడుగులు తేలిపడుతుండగా ఆనందంగా బయటకి నడిచారు!.

ప్రసారం : ఆకాశవాణి విశాఖ
23-9-1993

సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం
ప్రవేశ సంఖ్య.... E 18823 ........
తేదీ:..........